జిల్లా ఆసుపత్రిలో మీడియాపై ఆంక్షలు తొలగించాలి

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో మీడియాపై ఆంక్షలు తొలగించాలని ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్ డిమాండు చేశారు. జిల్లా ఆసుపత్రిలో కవరేజీ చేయకుండా ఆంక్షలు విధించటం ఏంటనీ ప్రశ్నించారు. సూచిక బోర్డులపై అనుమతి లేదని అంటించటంపై జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మీడియా స్వేచ్ఛను హరిస్తున్నట్టు, విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ మీడియా ప్రతినిధులకు ఇబ్బంది కలుగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సురేష్, శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రెటరి రాజ్‌కుమార్, అసిస్టెంట్ సెక్రెటరి రవి, సలహాదారుడు శంకర్, అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్, సభ్యులు రమేష్, తారు, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌కు సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాలో సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీషు మీడియం ఆసిఫాబాద్ విద్యార్థులు సంస్కృతి బోధ పరియోజన ప్రశ్నమంచ్ అంశంలో పాల్గొని దక్షిణ భారత విజ్ఞాన మేళాకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు కల్లూరి చరణ్, సాకేత్, హరిచరణ్, గుత్తి వెంకటరత్న ఈ నెల 18, 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రబంధకారణి, అచార్య బృంద విద్యార్థులు అభినందించారు.

పంట నమోదులో సాంకేతికత

- మొబైల్ యాప్‌లో పంటల వివరాలు నమోదు
- ప్రతీ క్లస్టర్‌లో రెండు వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే



వివరాలు నమోదు చేస్తున్న విస్తరణ అధికారి

వాంకిడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల వారీగా పంట నమోదు (డిజిటల్ క్రాప్ బుకింగ్) నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో పాటు విధివిధానాలను ఖరారు చేసింది. వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి మొబైల్ యాప్‌లో ఫొటోలతో సహా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతీ క్లస్టరులో రెండువేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని ఆదేశాలు జారీచేసింది. క్లస్టర్ పరిధిలో పురుష వ్యవసాయ విస్తరణ అధికారులు రెండు వేల ఎకరాలు, మహిళా ఏఈవోలు 1800 ఎకరాలు డిజిటల్ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో పంట సాగు వివరాలు

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)
పత్తి	3,35,363
వరి	56,861
కంది	30,430
మొక్కజొన్న	4,610
సోయా	2,872
పెసర	617

జిల్లాలో సీజన్ల వారీగా ఏటా ప్రభుత్వం పంటల సమగ్ర సర్వే చేస్తుంది. సంబంధిత వ్యవ సాయ సిబ్బంది పంట పొలాలను సందర్శించకుండా రైతులను అడిగి వివరాలు సేకరిస్తుండడంతో పంట ఉత్పత్తుల క్రయ విక్ర యాల సమ యంలో పలు ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. ఈ నేప థ్యంలో కేంద్ర ప్రభు త్వం డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. డిజిటల్ సర్వే చేయాలంటే తప్పని సరిగా పంట పొలాన్ని విస్తరణ అధికా రులు సందర్శించాల్సి ఉంటుంది. రైతుల వారీగా ప్రతీ సర్వే నంబరు సందర్శించడం కష్టం అవుతుందన్న భావంతో గతేడాది మాదిరిగానే ఈ సీజన్‌లోనూ ప్రయోగ్మకంగా కొన్ని గ్రామాల్లో డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేస్తూ మిగిలిన గ్రామాల్లో పాత పద్ధతిలోనే సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా 4.45 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

- **నమోదు ఇలా...**

ప్రభుత్వం సన్న ధాన్యానికి బోనస్ ఇస్తుండడంతో వరిలో ఏ విత్తన రకం వేశారనేది తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. రైతు పేరు, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు నమోదు చేయాలి. రైతుల మొబైల్‌లో ఎన్ని ఎకరాల్లో పంట వేశారనే సమాచారం మెసేజ్ రూపంలో చేరేలా ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు సర్వే నంబరు వారీగా పంట పొలాన్ని సందర్శించి వివరాలను నమోదు చేయడంతో పాటు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పంట సాగు లేకపోతే నో క్రాప్ అని నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేవాలు జారీ చేసింది. అక్టోబరు 25 నాటికి క్రాప్ బుకింగ్ పూర్తి చేసి 27న గ్రామపంచాయతీల్లో వివరాలు ప్రదర్శించాల్సి ఉంటుంది. పంటల నమోదులో తప్పులుంటే ఏఈవో దృష్టికి తీసుకెళ్లాలి. మార్పులు, చేర్పుల అనంతరం నవంబరు 5న తుది జాబితా ప్రదర్శిస్తారు.

గడువులోగా పూర్తి

- గోపికాంత్, మండల వ్యవసాయ అధికారి



ప్రభుత్వ ఆదేశాల మెరకు గడువులోగా క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. నిబంధనల మేరకు ప్రభుత్వ ఆదేశానుసారం సర్వే చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు సమాచారం అందించాము. ఇప్పటికే ఏఈవోలు మండలంలో క్రాప్ బుకింగ్ సర్వే చేస్తున్నారు. గడువులోగా క్రాప్ బుకింగ్ సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

ఓటరు జాబితాను సరిపోల్చండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2002, 2025 ఓటరు జాబితాలను సరిపోల్చాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అధికారులు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2002, 2025 ఓటరు జాబితా సరిపోల్చటంలో రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని పరిశీలించాలని తెలిపారు. జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలను సరిచూడాలని, నూతనంగా నియమించబడిన బూత్ స్థాయి అధికారులకు తగు శిక్షణ అందించాలన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రాల పరిధిలని కేటాయించాలని ప్రతి సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తన పరిధిలోని పోలింగ్ కేంద్రాల సూపర్ వైజర్లకు కేటాయించాలని తెలిపారు. వారంతం లోగా కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్, డాటా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తామని తెలిపారు.

వైద్యుల నియామకానికి చర్యలు

బెజ్జూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటామని డిసీహెచ్ఓ డాక్టర్ అవినాష్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో డాక్టర్లు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా వారం రోజుల్లోగా పూర్తి స్థాయిలో వైద్యులను నియమిస్తామన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వైద్య సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శారద, ఫార్మసిస్ట్ అయేషా, పీహెచ్ఎన్ కమల తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక



విజేతలైన జట్టుతో ఉపాధ్యాయులు, పీఈటీలు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తమ ప్రతిభ కనబరిచి మైనారిటీ గురుకులం విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా స్థాయి పోటీలు నజ్రూల్ నగర్‌లోని మూడో నెంబర్ విలేజీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణ మైనారిటీ గురుకుల బాలురు-1 కాగజ్‌నగర్ విద్యార్థులు ఎం.డి సైఫ్, కరణ్ సర్దార్, నైతిక్, గౌస్ బాబా, నవీన్‌లు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రోమి ప్రతిభ, పీఈటీ రాజశేఖర్, చిరంజీవి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కాగజ్‌నగర్ భట్టుపల్లి గ్రామానికి చెందిన చాపిడి మీరాబాయి తనకు జారీ చేసిన పెన్షన్ పుస్తకంలో ఆధార్‌నంబరు సరిచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన దస్నాబాయి తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు. బెజ్జూరు మండలం సల్గుపల్లికి చెందిన కమల తన భర్త చనిపోయినట్టు తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన లక్ష్మీ తాము ఉపాధి పనులు చేశామని సంబంధిత కూలి డబ్బులు ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నారు. వాంకిడి మండలానికి చెందిన సునిత చౌదరి ఎస్సీ వసతి గృహంలో వంట మనిషిగా పని చేసినట్టు, తనను ఉద్యోగం నుంచి తొలగించారని తిరిగి తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బంక పోశం తన పట్టాపాస్ పుస్తకం పోయిందని కొత్త పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెజ్జూరు మండలం సల్గుపల్లి గ్రామానికి చెందిన కమలాబాయి తన భర్త అనారోగ్యంతో మృతి చెందారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని దరఖాస్తును అందజేశారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కొలాంగూడకు రోడ్డు నిర్మించండి..

వాంకిడి (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎనోలి కోలాంగుడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతిని కాలినడకన నడవలేని పరిస్థితి తయారైందని గ్రామస్థులు వాపోతున్నారు. కొలాంగూడ గ్రామానికి పీవీటీజీ నిధులతో రోడ్డు మంజూరు అయినప్పటికి నేటి వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదన్నారు. గ్రామంలో మిషన్‌భగీరథ ద్వారా సక్రమంగా నీరు రావడం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఉన్న రోడ్డును మరమ్మతులు చేసి మంజూరైన రోడ్డు పనులను సత్వరమే ప్రారంభించి సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ బాధ్యులు దుర్గం దినకర్, కార్తిక్, వీటీడీఏ ఉపాధ్యక్షుడు సీడాం పగ్గు, మాజీ సర్పంచు కోట్రంగే బాబురావు, గ్రామ పటేల్ పోచయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ప్రారంభం

బెజ్జూరు, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం విశ్వ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వకర్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌లో భారీ వర్షం

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక సి. బాబు కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, బాలాజీ నగర్, సర్‌సిల్క్ కాలనీ, సంజీవయ్య కాలనీ, శ్రీకృష్ణనగర్, మార్కెట్ ఏరియా తదితర కాలనీల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. పాఠశాలల నుంచి ఇండ్లకు వెళ్లే సమయం కావడంతో బస్సులు, ఆటోలు రోడ్లపైనే నిలిచిపోయా యి. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరుచేరింది. ఉదయం నుంచి ఉక్కపోత ఉండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



భారీ వర్షంతో రోడ్లపై ప్రవహిస్తున్న వరదనీరు

పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడా మైదానంలో దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు 26వ స్మారక కబడ్డీ టోర్నమెంటును సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వాయి పురుషోత్తంరావు ప్రజాసేవే లక్ష్యంగా జీవించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఆయన చూపిన బాటలోనే నడుస్తామన్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే నివాసంలో దివంగత పాల్వాయి పురుషోత్తంరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేశారు. నౌగాం బస్తీలోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, బీజేపి జిల్లా అధ్యక్షుడు దోని శ్రైలం, నాయకులు కె శ్రీనివాస్, వీరభద్రాచారి, సిందం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

సిర్పూర్(టి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. సోమవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా జడ్పీ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. మొక్కలను సంరక్షించడంతోనే మానవాళి మనుగడ ఉంటుందన్నారు. గిరిజన పాఠశాలలో కూడా మొక్కలు నాటారు. సిర్పూర్(టి) ఈవో తిరుపతి, హెచ్‌ఎంలు సదాశివ్, రవీందర్ పవన్ పాల్గొన్నారు.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): ఏక్ పేడ్ మాకేనామ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్మోహన్ మాట్లాడుతూ తల్లి పేరిట మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కల తోటే మానవాళికి మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో సునీత, ఏపీవో రాజన్న, కార్యదర్శి వైకుంఠం, నాయకులు రాచకొండ శ్రీవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





బెజ్జూరులో మొక్కలు నాటుతున్న తహసీల్దార్, ఎంపీడీవో, సిర్పూర్(యు)లో..

సిర్పూర్(యు): మండలంలోని ఆయా పాఠశాలలో సోమవారం మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంను అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిర్వహించారు. ఆయా పాఠశాలలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లులను ఆహ్వానించి మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని మండల పరిషతు ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో కుడ్మేత సుధాకర్ మాట్లాడుతూ తల్లుల పేరుతో ఒక నాటడం జరుగుతుందని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత నాటిన వారే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు ఆత్రం దత్తు, ఉపాధ్యాయులు రాజు, కవిత, సైనాస్, విద్యా కమిటీ చైర్మన్ కనక వెంకటేష్, ఉపాధి హామీ టీఏ కనక విలాష్, కారోబార్ బారి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో నాటిన మొక్కలను బాధ్యతగా ప్రతి ఒక్కరు సంరక్షిం చుకోవాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, మాజీ సర్పంచులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి సీఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, శ్రీనివాస్ డిమాండు చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మిని కలిసివినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రీ ప్రైమరి విద్యను పకడ్బందిగా అమలు చేస్తున్న అంగన్వాడీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ల సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గంగామణి, సువర్ణ, వనిత, వినోద తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం

బెజ్జూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం హెల్త్ సూపర్ వైజర్ శారద ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అరుణ, తదితరులున్నారు.

శాంతి భద్రతలకు అందరూ సహకరించాలి

సిర్పూర్(టి),సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ప్రతీ ఒక్కరు సహకరించాలని సిర్పూర్(టి) ఎస్సై సురేష్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రతీ ఒక్కరు శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకారం అందించాలని కోరారు.



భాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై సురేష్

యూరియా కోసం తప్పని తిప్పలు

బెజ్జూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు యూరియా తిప్పలు తప్పడంలేదు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘానికి యూరియా బస్తాలు రావడంతో రైతులు యూరియా కోసం పెద్ద మొత్తంలో క్యూ లైన్లలో నిలుచున్నారు. కౌటాల సీఐ సంతోష్, బెజ్జూరు తహసీల్దార్ రామ్మోహన్, ఎస్సై సర్తాజ్ పాషా యూరియా కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో రైతుకు టోకెన్లు అందజేసి వరుస క్రమంలో ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు బస్తాలు అందించారు.



లారీని అడ్డుకున్న రైతులు

- **యూరియా లారీని అడ్డుకున్న రైతులు**

దహెగాం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాస్పెల్లి గ్రామంలో సోమవారం రైతులు యూరియా బస్తాల లారీ అడ్డుకున్నారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. గిరవెల్లి రైతు వేదిక వద్ద యూరియా బస్తాలు పంపిణీ చేయడానికి వెళ్తున్న యూరియా లారీని చిన్నరాస్పెల్లి వద్ద అడ్డుకున్నారు. ఆందోళ న చేస్తున్న రైతుల వద్దకు కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమార స్వామి, ఏవో రామక్రిష్ణ, డిప్యూటీ తహసీల్దార్ గణేష్ చేరుకొని రైతులతో మాట్లాడారు. గిరవెల్లి రైతు వేదిక వద్ద 888 యూరియా బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రం ఎదుట మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతు లు సోమవారం రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకు న్న ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో చర్చించారు. సరిపడా యూరియ అందేలా చూస్తామని చెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు. అనంతరం పోలీస్ పహార మధ్య యూరియా పంపిణీ చేపట్టారు.



బెజ్జూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

- **రైతులకు అన్నాదానం**

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని సహకార బ్యాంకు వద్ద వ్యవసాయ సహకార శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ క్రమంలో యూరియా కోసం వచ్చిన రైతులకు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కీజర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంల ధర్నా



మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

నస్పూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీ యూ) ఆధ్వర్యంలో నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) అనితకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏఎన్‌సి టార్గెట్లను రద్దు చేయాలన్నారు. ఏఎన్ఎంలపై పని భారం, అధికారుల ఒత్తిడిని తగ్గించాలన్నారు. ఈ ధర్నాలో యూని యన్ నాయకులు పద్మ, మంజుల, సరోజ, హరిత, కవిత, తులసీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికపల్లి గ్రామానికి చెందిన కర్రె శంకరయ్య(49) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. ఇటీవల శంకరయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో కొన్ని రోజులుగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఇంటి నిర్మాణానికి సమీపంలో ఒక గుడిసె ఏర్పాటు చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. గుడిసె నుంచి నూతనంగా చేపడుతున్న ఇంటి నిర్మాణం వద్దకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తుండగా షాక్ తగిలింది. దీంతో అక్కడే ఉన్న గ్రామస్థులు విద్యుత్‌వైర్‌ను కర్రతో కొట్టి శంకర్‌ను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శంకర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శంకరయ్య వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. భార్య, కూతురు ఉన్నారు.

మద్యం మత్తులో డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

కాసిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీలో మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ పడి మారం కుమార్ (40) అనే వ్యక్తి మృతి చెందాడు. కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కుమార్ కూలీ పనులు చేస్తూ జీవించే వాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాయి. గత శుక్రవారం మద్యం ఎక్కువ తీసుకున్నాడు. మళ్లీ మద్యం సేవించేందుకు వానలో బయటకు వచ్చాడు. కల్వర్టుపై కూర్చుని మద్యం తాగుతుండగా ప్రమాదవశాత్తూ డ్రైనేజీలో పడి మృతి చెందినట్లు తెలిపారు. కుమార్‌కు భార్య, కూతురు ఉన్నారు. ఈమేరకు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

లక్సెట్టిపేట, సెప్టెంబరు, 15 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండలం హన్మంత్‌పల్లి గ్రామానికి చెందిన జెడ కిష్టయ్య(36) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం కిష్టయ్య గ్రామంలో కొంత మంది భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటాడు. ఈనెల 14న పంటలకు కొట్టేందుకు మందులు కొనుగోలు చేసుకుని ఇంటికి తీసుకువచ్చాడు. కిష్టయ్య రెండో భార్య లక్ష్మి ఉన్న కొద్ది పంటకు ఇన్ని మందులు ఎందుకు తెచ్చావని ప్రశ్నించింది. దీంతో మాటామాట పెరిగి గొడవపడ్డారు. దీంతో లక్ష్మి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి మరుసటి రోజు ఇంటికి వచ్చింది. పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్న భర్తను గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు కిష్టయ్య అన్న జెడ లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నానో అంటున్న రైతులు



- ద్రవరూప ఎరువుపై అనాసక్తి
- తక్కువ ధర ఎక్కువ ఉపయోగం
- అయినా మొగ్గుచూపని రైతులు
- రసాయన ఎరువులతో భూములు నిస్సారం

బెజ్జూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. వివిధ పంటల్లో దశల వారీగా ఉపయోగించే యూరియా కొరత అన్నదాతను వేధిస్తోంది. ఈ క్రమంలో నానో (ద్రవరూపం) యూరియాపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొంటున్నారు. ఇందుకోసం అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో అంచనాల మేరకే వరి, పత్తి, ఇతర పంటలు సాగవుతున్నా ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది. అధిక దిగుబడుల పేరుతో రైతులు ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నారు. ఖరీఫ్‌లో ప్రధానంగా పత్తి, వరి, మిరప, కంది తదితర పంటలు రైతులు సాగు చేస్తుంటారు. వ్యవసాయ అధికారుల లెక్క ప్రకారం ఎకరం వరి పంటకు మూడు దఫాలుగా 90 కిలోలు(రెండు బస్తాలు) యూరియా మాత్రమే వాడాలి. అదే మొక్కజొన్నకు ఎకరాకు రెండు దఫాలుగా మూడు బస్తాలు యూరియా వాడాలి. పంటల ఉత్పత్తికి రైతులు మోతాదుకు మించి యూరియా, డీఏపీ ఎరువులను వాడుతున్నట్లు వ్యవసాయ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీ స్థానంలో ద్రవరూప నానో యూరియా, డీఏపీలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వీటిపై రైతుల్లో అవగాహనలేక ఉపయోగించ లేకపోతున్నారు. నానో యూరియా, డీఏపీని వినియోగిస్తే మేలు చేకూ రుతుందని వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

నాలుగు లక్షల ఎకరాల్లో సాగు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పైగా వివిధ వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి, 47వేల ఎకరాల్లో వరి, మరో 20 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం...

నాగరాజు, వ్యవసాయ అధికారి



నానో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయి. వీటి వినియోగంతో రైతులకు ఆర్థిక భారం, శారీరక శ్రమ తగ్గుతాయి. సాధారణ యూరియా, డీఏపీలు ఎంత పని చేస్తాయో నానో ఎరువులు కూడా అంతే పని చేస్తాయి. అన్ని రకాల పంటల్లో నానో యూరియాను వాడవచ్చు.

తక్కువ ధరకే లభ్యం..

ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా బస్తా యూరియా ధర 266 రూపాయలకే విక్రయిస్తోంది. అదే బయట మార్కెట్‌లో 300 రూపాయల నుంచి 400 రూపాయల వరకు అమ్ముతున్నారు. బస్తాను ఇంటికి తీసుకరావడానికి మరి కొంత ఖర్చు అవుతుంది. అదే నానో యూరియా 500 మిల్లీలీటర్ల సీసా ధర మార్కెట్‌లో 225 రూపాయల నుంచి 230 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 500 మిల్లీలీటర్లు సరిపోతుంది. అదే నానో డీఏపీ లీటరు ధర 600 రూపాయలు పలుకుతోంది.

నానో ఎరువుతో ఉపయోగాలు...



నానో ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుంది. నాణ్యమైన దిగుబడు లకు అవకాశం ఉంటుంది. నత్రజని, బాస్వరం, పొటాషియం, సూక్ష్మ పోషకాలైన జింక్ సమృద్ధిగా అందుతాయి. ద్రవరూపంలో ఉండటంతో ఆకులపై పిచికారి చేసినప్పుడు రంధ్రాల ద్వారా సులభంగా లోనికి వెళుతూ మొక్క అన్ని బాగాలకు చేరుకుంటుంది. ఈ ద్రవరూప ఎరువు నానో వాడకంపై రైతు లు అనాసక్తి చూపుతున్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు నానోపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నా వాడకానికి ముందుకు రావడం లేదు.

జీతాలు చెల్లించాలని విధులు బహిష్కరణ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జీతాల చెల్లింపులు వెంటనే చేయాలని కోరుతూ సోమవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ తమకు జీతాల సమస్యను ఇంత పరిష్కరించటం లేదన్నారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు విధులు బహిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులు ఆందోళన చెందవద్దు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల వేతనాల కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం అందజేసినట్టు, రాష్ట్రప్రభుత్వం నుంచి రూ.2.99 కోట్లు త్వరలోనే చెల్లింపు చేస్తోందని పేర్కొన్నారు. ఎవరు కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్మికులు విధులకు హాజరు కావాలని కోరారు.

కమ్మ సేవాసమితి కార్యవర్గం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కమ్మ సేవా సమితి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగవరపు శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వర్‌రావు, కోశాధికారిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నాయకులు వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివఆసరావు, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ఆదర్శంగా నిలవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామ పంచాయతీ, ప్రతీ పట్టణం స్వచ్ఛతలో ఆదర్శంగా నిలువాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు జరుగనున్న స్వచ్ఛహీసేవా 2025 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ కార్యక్రమాలు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగనున్న కార్యక్రమాల్లో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. పరిశుభ్రతను తమ వ్యక్తిగత సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో హమర్ హుస్సేన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణదాతలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షంలో భాగంగా సోమవారం మంచిర్యాలలోని ఎం కన్వెన్షన్ హాలులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం అందించడానికి బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రక్తదాన శిబిరంలో 75 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్

బకాయిలు చెల్లించాలని నిరసన



కాగజ్‌నగర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ డిగ్రీ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, విద్యార్థులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వసుంధర కళాశాల కరస్పాండెంట్ కుడిక్యాల రాజమౌళి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లింపులు చేయకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో రెబ్బెన ఆర్ట్స్ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం తరగతులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజురీయియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు.



లాభాల వాటాపై యాజమాన్యం మొండివైఖరి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి లాభాల వాటాపై యాజమాన్యం మొండివైఖరి సరికాదని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టిన అనంతరం మాట్లాడారు. సొంతింటి పథకా నికి అనుకూలంగా ఓట్లు వేసిన నాయకులకు ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. వాస్తవ లాభాలనే వెంటనే ప్రకటించి 35 శాతం కార్మికుల కు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ఎన్నికల సందర్భంగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు తాము ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. క్లర్క్ పోస్టుల భర్తీకి సర్క్యులర్ విడుదల చేసి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు నియమాకాలు చేపట్టలేదన్నారు. స్ట్రక్చర్ సమావేశం బహిష్కరించి కార్మిక క్షేత్రంలో పర్యటించాలని, ఇతర యూనియన్లతో కలిసి ఉద్యమించి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని సూ చించారు. కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు వెంగళ శ్రీనివాస్, సాయిల శ్రీనివాస్, షావలి, తోడె సధాకర్, సిరికొండ శ్రీనివాస్, చిగురు లక్ష్మణ్, తిలక్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోల్ ఇండియా, సింగరేణి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు కోల్‌కతాలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎదుట వివిధ రాష్ట్రాలకు చెందిన బొగ్గు గనుల విశ్రాంత కార్మికులు సోమవారం భారీ ప్రదర్శన చేపట్టారన్నారు. ఈ పోరాటానికి తాము మద్దతు ఇస్తున్నామన్నారు. 27 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన కోల్ మైన్స్ పెన్షన్ స్కీం- 1998 ప్రకారం కనీస పెన్షన్ 350 రూపాయలుగా ఉందన్నారు. ఎన్నో ఆందోళన ఫలితంగా దానిని వెయ్యి రూపాయలకు పెంచారన్నారు. ఈ పెన్షన్ సైతం రిటైర్డ్ ఉద్యోగులకు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు.

ప్రతీ మూడేళ్లకు పెన్షన్‌ను సవరించాల్సి ఉండగా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వినియోగ దారుల ధరల సూచీని అనుసరించి డీఏ అనుసంధానం చేస్తూ పెన్షన్ పెంచాలని, ఐదేళ్లకోమారు వేతన ఒప్పందంతో పెన్షన్ పెంపు తప్పనిసరి చేయాలన్నారు. కంపెనీలకు వచ్చే లాభాల నుంచి సీఆర్ఆర్, డీఎంఎఫ్ లను మూడు శాతం పెన్షన్ ఫండ్‌కు జతచేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, కార్మికులకు ఒకేరకమైన వైద్యవిధానం కొనసాగించాలని కోరారు.

హామీల అమలులో గుర్తింపు సంఘం విఫలం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ విఫలమైందని ఐఎన్‌టీయుసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య విమర్శించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల ముందు ఏఐటీయూసీ నాయకులు సింగరేణిలో ఉద్యోగులకు సొంతింటి పథకం అమలు చేయిస్తామని, మారుపేర్లు మార్పు చేయిస్తామని, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు, మైనింగ్‌స్టాఫ్‌కు షుటేబుల్ జాబ్స్ ఇప్పిస్తామని చెప్పినా హామీలు ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదన్నారు. ఇటీవల సింగరేణి సీఎండీ, ఇతర డైరెక్టర్లతో నిర్వహించిన స్ట్రక్చరల్ సమావేశాన్ని బహిష్కరించామని గుర్తింపు సంఘం చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించడం చేతగాకపోతే తప్పుకోవాలని విమర్శించారు. అంతేగాకుండా ఆ సంఘం పని తీరు చూస్తే నవ్వొస్తుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కార్మికులు సమస్యలతో సతమతమువుతున్నారని పేర్కొన్నారు. పైరవీలకు అలవాటుపడ్డ ఆ సంఘం నాయకులు ఉద్యోగుల సమ స్యలను గాలికి వదిలేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయుసీ నాయకులు

విచ్చలవిడిగా వేధింపులు జరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఒక వైపు సింగరేణిలో డిపెండెంట్ సంబంధించి ఉద్యోగుల గురిం చి విజిలెన్స్ వద్ద 3,500 కారుణ్య నియమకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడ పరిష్కరించలేని పరిస్థితులో ఉన్నారని అన్నారు. యాజమాన్యానికి గుర్తింపు సంఘం అనుకూలంగా ఉన్నందునే ఉద్యోగులపై యాజమాన్యం పెత్తనం చెలాయిస్తోందన్నారు.

చాలా గనులపైన మస్టర్ పడకముందే పట్టించుకోవడం లేదన్నారు. ఎక్కడ చూసిన గుర్తింపు సంఘం పైరవీ సంఘంగా మారిందని ధ్వజమెత్తారు. తమ యూనియన్ కార్మికుల హక్కుల సాధన కోసం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా 35శాతం ఇప్పిం చాలని తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నేతృత్వంలో తెలుపుతామన్నారు. సమావేశంలో నాయకులు రాములు, నరేందర్, మిట్ట సూర్యనారాయణ, డి శంకర్‌రావు, కె ఓదెలు, క్రిష్ణమోహన్, కొప్పుల బాబు, కారుకురి తిరుపతి, శనిగారపు రామయ్య, సోగాల కన్నయ్య, నూనె సాంబయ్య, భీమరపు సదయ్య, దేవ రమేశ్, రాజేంద్రప్రసాద్, కుమారస్వామి మధు, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం అందరికి స్ఫూర్తి



శ్రీరాంపూర్‌లో నివాళులు అర్పిస్తున్న అధికారులు

జైపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం అందరికి స్ఫూర్తి అని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా ఎస్టీపీపీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు నర్సింహారావు, సంతోష్‌కుమార్, మురళీధర్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, పంతుల , కిరణ్‌బాబులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత దేశపు గొప్ప ఇంజనీరు అని ఇన్‌చార్జి జీఎం కె రాజేందర్ కొనియాడారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని జీఎం కార్యాలయంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. విశ్వేశ్వరయ్య ఇంజనీరు, రాజనీతిజ్ఞుడు అన్నారు. అనంతరం డీజీఎం(వర్క్‌షాప్) రవీందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీరు సాంబశివరావు, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, ఏజెం ట్లు శ్రీధర్, రవికుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, డీజీఎంలు రాజన్న, ఆనంద్ కుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కలకత్తాలోని కోలిండియా ప్రధాన కార్యాలయం ముందు బొగ్గు పెన్షన్ దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా పెన్షన్ పెంచకపోడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస పెన్షన్ రూ. 15 వేలుగా నిర్ణయించి వెంటనే అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, వెంకటయ్య, నర్సయ్య, పోచయ్య, గంగయ్య, రమేష్, రాజిరెడ్డి, లక్ష్మణ్, రామయ్య, శ్రీనివాస్, సత్యనారాయణరావు, శ్రీనన్న, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

సాయుధ పోరాట అమరులను మరువలేం

జన్నారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట అమరులను మరువలేమని సీపీఎం పార్టీ కార్యదర్శి సంకె రవి అన్నారు. తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అమరవీరులకు సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిందన్నారు. పోరాటంలో ఎంతో మంది వీరులు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారని వారి సేవలు మరువలేనివన్నారు. జాగీర్దారుల నుంచి నుంచి పదిలక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచిన ఘనత సాయుధ పోరాట నాయకులదే అన్నారు. సాయుధ పోరాట యోధులను బీజేపీ, ఆర్ఎస్ఎస్, అధికార పార్టీలు అణిచివేతకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, లింగన్న, బుచ్చయ్య, యశోద, అబ్దుల్లా, చంద్రయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌కు ఘన నివాళి

జన్నారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ ఏలేటి సోమిరెడ్డికి జన్నారం మండల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు సోమవారం నివాళులర్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్ మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సోమిరెడ్డి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సమస్యలను అదిగమించాలే తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. ఆయన ఆత్మశాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ డబ్బులు ఇప్పించండి

కాసిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతూ ప్రజావాణిలో తాటిగూడెంనకు చెందిన ఉపాధి కూలీలు సోమవారం వినతిపత్రం అందించారు. ఉపాధి కూలీ మడావి వెంకటేష్ మాట్లాడుతూ 24 మంది కూలీలకు మే, జూన్‌లో చేసిన పనులకు ఇంతవరకు డబ్బులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలన్నారు.

రైల్వేల అభివృద్ధికి రూ. 80వేల కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో, అమిత్‌షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో యూరియా కొరత ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నా చర్యలులేక పోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందన్నారు. రాష్ట్రంలో పేదోడు బతికే పరిస్థితి లేదని, రోగమొస్తే పట్టించు కునే నాథుడే లేకుండా పోయారని బండి సంజయ్ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం తమదేనని జబ్బలు చర్చుకున్న కాంగ్రెసోళ్లు బకాయిలు ఇవ్వక పోవడంతో రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు రానియ్యడం లేదన్నారు. పోనీ సర్కారు దవాఖానాకు పోదామంటే సూది, మందుబిల్లలు లేవన్నారు.

రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి

మంచిర్యాల కలెక్టరేట్ : రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసేందుకు కృషి చేస్తామని బండి సంజయ్ కుమార్ అన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం చేస్తున్న అభివృద్ధిపై పలు పార్టీలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని, దేశంలో అవినీతి, అక్రమాలు లేకుండా నవశకానికి నాంది పలుకుతూ దేశంలో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తుంది నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రైల్వే డీఆర్‌ఎం గోపాలకృష్ణన్, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, బీజేపీ రామగుండం ఇన్‌చార్జీ కందుల సంధ్యారాణి, పోచం, కేవీ ప్రతాప్, మంచిర్యాల రైల్వేస్టేషన్ మేనేజర్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మెజార్టీ వర్గాల సమాన హక్కుల కోసం పోరాడిన యోధుడు పెరియార్ రామస్వామి జయంతి వేడుకలను సోమవారం మంచిర్యాలలో బీసీ బహుజన ఐక్యవేదిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండయ్య,మల్లయ్య, పోచయ్య, రాజేశం, నీలకంటేశ్వర్‌గౌడ్, కిష్టయ్య,సత్యనారాయణ, శ్రీహరి, కనకయ్య, కృష్ణ, జయరావు, కిరణ్, రమేష్, సూర్యనరాయణగౌడ్, అశోక్, అంజయ్య, ప్రకాష్, శంకర్ తదితరులుపాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా కొండగుర్ల లింగన్న

జన్నారం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ మండల కార్యదర్శిగా కొండగుర్ల లింగన్నను సోమవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సంకె రవి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ తన వంతు బాధ్యతగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, బుచ్చయ్య, రాజన్న, లక్ష్మీ, యశోద, సువర్ణ పాల్గొన్నారు.

అతివల ఆరోగ్యానికి రక్ష



రేపటి నుంచి మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాలు

కోటపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఇంటా, బయట పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళల ఆరోగ్యానికి మరింత భరోసా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ప్రతి మహిళకు స్వాస్త్‌నారి, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం పేరుతో వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. 15 రోజుల పాటు ప్రత్యేకంగా మహిళలకు శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మహిళ శిశు సంక్షేమ శాఖ పోష్ మా కార్యక్రమానికి అనుసంధానంగా ప్రతి మహిళకు వైద్య పరీక్షలు చేసి వారి అనారోగ్య సమస్యలు గుర్తించి మందులు అందించడం, అవసరమైన వారికి ఉన్నత వైద్యం అందించేందుకు ఆసుపత్రులకు పంపిస్తారు. జిల్లాలోని పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో ఈ వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.



వైద్య పరీక్షలు ఇలా...

వైద్యకళాశాలల్లో పనిచేసే గైనకాలజీ, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మ, మానసిక, దంత, మహిళ వైద్యు లతో వైద్య పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేయ నున్నారు. అలాగే రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ పరీక్షలు సై తం చేయనున్నారు. మహిళలకు రక్తహీనత సమస్య అ ధికంగా ఉంటున్నందున దీనిపై యుక్త వయస్సులోని అమ్మాయిలకు అవగాహన కల్పించేందుకు దృష్టి పెట్ట నున్నారు. గిరిజన తండాల్లో సికిల్ ఎనిమియా పరీక్ష లు చేసి తగిన జాగ్రత్తలు వివరించేందుకు వైద్య శాఖ సిద్ధమవుతుంది. 15 రోజుల పాటు ప్రత్యేకంగా నిర్వ హించే ఈశిబిరాల వల్ల అతివల ఆరోగ్యానికి రక్ష చేకూ రుతుందనే అభి ప్రాయాలు వెలువడుతున్నాయి.

క్రీడల్లో గెలుపోటములు సహజం : సీఐ

బెల్లంపల్లి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని తాళ్లగురిజాల సీఐ హనుక్ అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ కాసిపేట గురుకుల కళాశాలలో అండర్ 19 రాష్ట్రస్థాయి వాలీ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై సీఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులు ముందుకు వెళ్లాలని సూచించారు. క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలతో చెడు అలవాట్లకు దూరంగా ఉండడమే కాకుండా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్, ఎస్‌జీఎఫ్ అండర్19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెక్రటరీ బాపురావుతో పాటు వందమందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు.



వాలీబాల్‌క్రీడాకారులతో సీఐ, నిర్వాహకులు

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లి ఎంపీకి సీపీఐ నాయకుల వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న బెల్లంపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని, రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పెద్దపల్లిఎంపీ వంశీక్రిష్ణకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ మాట్లాడుతూ బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ఆధారంగా రైల్వేశాఖకు కోట్ల రూపాయల ఆదాయం ఉన్నప్పటికీ అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. రైల్వే స్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో 25కిలో మీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు, 45కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని పేర్కొన్నారు. బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు పూర్తి స్థాయిలో అన్ని ప్లాట్‌ఫాంల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల ను ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రేచిని రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపండి..

తాండూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచిని రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరుతూ సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మండల బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. సికింద్రాబాద్ కాగజ్‌నగర్ రైలును ఆపాలని, అలాగే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపితే మండలంతో పాటు తిర్యాణి, భీమిని, కన్నెపల్లి మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే రేచిని రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు భరత్, నాయకులు శేషగిరి పాల్గొన్నారు.

పట్టణ వాసికి సేవారత్న అవార్డు

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 15(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణానికి చెందిన రెడ్డిమల్ల ప్రకాశం జాతీయ సేవా రత్న అవార్డును అందుకున్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణంలో మదర్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రకాశం చేసిన సేవలను గుర్తించిన సంస్థ ప్రముఖ నటి రజిత శాండి చేతుల మీదుగా అవార్డును అందజేసింది. ప్రకాశంను పలువురు అభినందించారు.

బీఆర్‌ఎస్ పాలనలో బడా కాంట్రాక్టర్లకు పెద్దపీట

రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చెన్నూరు నియోజకవర్గంలో బడా కాంట్రాక్టర్లకు పెద్దపీట వేశారని, చిన్న చిన్న కాంట్రాక్టర్లకు పనులు లేకుండా చేశారని ఇది కమీషన్‌ల కోసమేనని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. సోమవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రజలకు జవాబుదారీ తనంగా తమ పాలన కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ భవనాలు, పార్కుల పేరుతో ప్రజాధనం వృధా చేశారన్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్‌ల కోసం జరిగిన పనులన్నింటిని తాను పరిశీలించానని, అందుకే వాటిని నిలిపివేశానని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో పనుల పురోగతితో పాటు ఇంకా వెచ్చించాల్సిన నిధుల గురించి ఆయా శాఖల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించానని తెలిపారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించానన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ. 5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకం కింద వంద కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బతుకమ్మ పండగకు సంబంధించి మహిళలకు చీరలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ రాజలింగుకు సూచించానని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజలింగు, ఆర్‌ఐ, అధికారులు పాల్గొన్నారు.



మందమర్రిలో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

పోషక లోపం అధిగమిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో రేష్మ

దండేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోషక లోపాలను అధిగమిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునే విధంగా సిబ్బంది కృషి చేయాలని లక్షెట్టిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రేష్మ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ బి-పడాయి బి అనే కార్యక్రమంపై సోమవారం దండేపల్లిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల అంగన్‌వాడీలకు మూడు రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని నవ చేతన ద్వారా 3ఏళ్ల పిల్లలకు ఇవ్వాలసిన ప్రారంభ ప్రేరణ, 3 నుంచి 6ఏళ్ల పిల్లలకు ఇచ్చే బాల సంరక్షణ, అధిక నాణ్యత, ఆట, ఆధారిత పూర్వ ప్రాథమిక విద్యపై వివరించారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పౌష్టికాహారంతోనే పుట్ట బోయే బిడ్డ మంచి ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు సమతుల్య ఆహారం తీసెకుంటునే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మం డల సూపర్‌వైజర్ల జాడి వెంకటలక్ష్మి, మమత, వాణి, రమా దేవి, అంగన్‌వాడి కార్యకర్తలు తిరుమల, ఆశ కార్యకర్తలు, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న సీడీపీవో రేష్మ

పింఛన్‌లు పెంచాలని వినతి

జైపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, కల్లుగీత కార్మికులకు పింఛన్‌లు పెంచాలని కోరుతూ సోమవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సం దర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్ మాదిగ, సీనియర్ నాయకులు ఇరిగిరాల మల్లేష్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు తదితర పింఛన్‌దారులకు రూ. 4 వేలు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదన్నారు. వెంటనే పింఛన్‌లు పెంచాలని లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. నాయకులు రామగిరి సడవెల్లి, సుందిళ్ల సమ్మయ్య, ఎనగందుల మల్లయ్య, చిన్నరాజం, పోశం, హనుమయ్య, పాల్గొన్నారు.

జన్నారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నూతన పెన్షన్‌ను ఉన్న పెన్షన్‌కంటే రెట్టింపు చేసి ఇస్తామన్న పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు కొండుకూరి ప్రభుదాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీడి పెన్షన్ కార్మికులకు 2వేల నుంచి 4 వేలు, వికలాంగులకు 6వేలు వెంటనే అమలు పరుచాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా పెన్షన్లు కూడ వెంటనే అమలు పరుచాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజు, సుధాకర్, సుమారు లబ్దిదారులు పాల్గొన్నారు.

చెన్నూరు : వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, తదితర పింఛన్‌దారులకు పింఛన్‌లు పెంచాలని కోరుతూ సోమారం ఎంఆర్‌పీఎస్ నాయకులు చెన్నూరు డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తదితర పింఛన్ దారులకు రూ.4 వేలు పింఛన్ పెంచాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడం సరికాదన్నారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ బస్సును నడిపించండి..

కన్నెపల్లి : మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం మంచిర్యాల ఆర్టీసీ ఆర్‌ఎం, డిపోమేనేజర్‌కు వినతి పత్రం అందించారు. పదేళ్ల క్రితం బస్సు వచ్చేదని, రోడ్డు మధ్యలో ఉన్న ఒర్రె బ్రిడ్జి తెగి పోవడంతో బస్సును ఆపివేశారని తెలిపారు. బెల్లంపల్లి నుంచి దహెగాం వెళ్లే ప్రతి బస్సును సుర్జాపూర్ మీదుగా నడిపించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆశన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, నాయకులు తిరుపతి, రామయ్య యాదవ్, రాజులాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమిని : భీమిని, కన్నెపల్లి మండలాల్లోని విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం బెల్లంపల్లిలోని 33 కేవీలో మరమ్మతులు కారణంగా కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటుచేస్తున్నట్లు డీఈ రాజన్న తెలిపారు. రెండు ఉప కేంద్రాల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరపరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

కన్నెపల్లి : కన్నెపల్లి ఫీడర్ మెయింటనెన్స్ పనుల వల్ల మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. భీమిని, కన్నెపల్లి, జన్కాపూర్, నాయకునిపేట, నెన్నెల, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు

వేమనపల్లి : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు మంచిర్యాలలోని మంతి వివేక్‌వెంకటస్వామి ఇంటిని ముట్టడిచేందుకు వెళ్తుండగా నీల్వాయి పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రిని కలవడానికి వెళ్తున్న తమను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ల ఆవిష్కరణ

జన్నారం: ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో మండల అధ్యక్షుడు దుమ్మల ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని ఓం కన్వెన్షన్ హాల్‌లో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలకు శిక్షణ ఉంటుందన్నారు. ఫొటో గ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మకత అవసరమని ఎక్స్‌పోలో కొత్త పరికరాలు కెమెరామెన్, డ్రోన్ సిట్టింగ్, లైటింగ్, ఎడిటింగ్, స్టూడియో వంటి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసంఘం ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు వసంత్, వేణుగోపాల్, రవి, బీమేష్, శ్రీనివాస్, చారి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతిపత్రం అందజేత

జన్నారం: మధ్యాహ్న భోజన కార్మికుల ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు 9 నెలలుగా డీఏను విడుదల చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు కుకటికారి బుచ్చయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికు లకు వేతనాలు 10వేలు పెంచాలన్నారు. ఈ క్యాక్రమంలో నాయకలు పాల్గొన్నారు.

'అప్పుడే మంచిగుండే' కార్యక్రమం

మందమర్రిరూరల్ : మండలంలోని అందుగులపేట, శంకర్‌పల్లి గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు అప్పుడే మంచిగుండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సమస్యలను ఫిర్యాదుల ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ లౌడం రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్న కాలంలో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కా రమయ్యేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు మేకల శంకర్, దుర్గం శివ, అఖిల్, పుష్పలత, విష్ణు, సాయి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఉద్యోగుల జేఏసీ నాయకులు



మంత్రి వివేక్‌కు పూల మొక్కను అందిస్తున్న శ్రీహరి

నస్పూర్ : రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని సోమవారం మర్యాదపూర్వకంగా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరిలతో పలువురు కలిసి పూల మొక్కను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేసినందుకు, వందే భారత్ రైలును మంచిర్యాలలో హాల్టింగ్‌కు కృషి చేసినందుకు టీజీఈజేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. టీజీఈ జేఏసీ నాయకులు పొన్న మల్లయ్య, జాడి రామ్ కుమార్, తిరుపతి, వెంకటేశ్, శ్రీధర్, రాజు, సురేందర్, యూసఫ్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్, కాసిపేట, ధర్మారావుపేట, జన్నారం, దండేపల్లి, కిష్టంపేట, తాళ్లపేట, లక్షెట్టిపేట, మంచిర్యాల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

హాస్టళ్లలో దోమల నివారణ స్ప్రే

వేమనపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం వేమనపల్లిలోని బాలుర ఆశ్రమహాస్టల్, నీల్వాయి కేజీబీవీ హాస్టల్‌లో దోమల నివారణ కోసం ఏసీఎం, ఐఆర్‌ఎస్ స్ప్రే చేయించారు. వైద్యుడు మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌ఈవో శ్రీనివాస్, సూపర్ వైజర్ అపరంజి, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఇన్‌చార్జీ హెచ్‌ఎం జ్ఞానేశ్వర్, కే జీబీవీ హెచ్‌ఎం మయూరి, ఏఎన్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన దుర్గం వినోద్ కుమార్

జన్నారం,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్ కుమార్ సీనియర్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం నల్గొండ జిల్లాలో జరిగిన 12వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం గెలుచుకున్నారు. తెలంగాణ రాష్ట్రం తరుపున వచ్చే నెలలో 9 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో నిర్వహించే జాతీయ యోగా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి సిద్ద రెడ్డి తెలిపారు. ఆయన ఎంపిక పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీచైతన్యలో హిందీ దివస్ వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం లక్ష్మీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గొప్ప కవులు సూరదాస్, కబీర్, తులసిదాస్ వేషధారణలతో నాటికలను ప్రదర్శించారు. హిందీ సాహిత్య గొప్పతనాన్ని వివరించారు. సోషల్ మీడియా విద్యార్థులపై ఎలా ప్రభావం చూపుతుందో విద్యార్థులు మైండ్ రోల్‌ప్లేతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవిందరెడ్డి, కోఆర్డినేటర్లు నాగరాజు, ప్రిన్సిపాల్ జయశ్రీ, శ్యాం, కృష్ణవేణి, స్నేహలత పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని అచ్చలాపూర్‌లో గల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు సురేందర్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల క్రైం, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన వ్యాస రచన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, సుస్థిర అభివృద్ధి కోసం ఐక్యరాజ్య సమితి సూచించిన అంశాలు భారతదేశానికి ఉపయోగకరంగా ఉన్నాయా అనే అంశాలపై జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా కిష్టాపూర్ విద్యార్థులు అరవింద రాణి, వర్షిత, త్రివేదలు మొదటి స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కిష్టాపూర్, జన్నారం మండల విద్యార్థులు సాకేత, అక్షిత, రిషిక మొదటి స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్రధానోపాధ్యాయులు రమేష్, సెక్టోరల్ అధికారులు సత్యనందమూర్తి, చౌదరి శ్రీనివాస్‌రావులు విద్యార్థులను అభినందించారు.

మంత్రి ఇంటి ఎదుట అంగన్‌వాడీల ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మంచిర్యాల లోని రాష్ట్ర మంత్రి వివేక్‌వెంకటస్వామి ఇంటిముందు అంగన్‌వాడీఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీయూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యక్షురాలు త్రివేణి, భానుమతి, రాజమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్‌లను పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్‌ను ఉదయం ఇంటివద్ద అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు దేవదాస్, అంగన్‌వాడీ నాయకులు వినోద, అరుణ, సబితా, లక్ష్మీ, పద్మావతి, శారద, శిరీస, రాణి, రాజేశ్వరి, సరిత, ప్రవీణ, మానస పాల్గొన్నారు.

శిశువు పిండం గుర్తింపు

భీమారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని బంజారా తండాలోని పోచమ్మ వార్డులోని మురుగునీటి కాలువలో సోమవారం గుర్తు తెలియని మగ శిశువు పిండం లభ్యమైంది. ఇదే కాలనీకి చెందిన బానోత్ విజయ్‌కుమార్ పిండంను చూసి భీమారం గ్రామ ఇన్‌చార్జీ సెక్రటరీ బాల్నే దేవేందర్‌రెడ్డికి తెలుపగా ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్‌ఐ శ్వేత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధి గ్రస్తుల కోసం వైద్యుడిని నియమించాలి

మందమర్రిరూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధి గ్రస్తుల కోసం డాక్టర్‌ను నియమించాలని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సంఘ సేవకుడు వంజరి వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు దరఖాస్తు అందించాడు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కిడ్నీ సంబంధిత వ్యాధి గ్రస్తులు పెరిగిపోతున్నారని, నెఫ్రాజలిస్టు, యూరాలజిస్టు వైద్యులను వెంటనే నియమించాలని కోరారు. డయాలసిస్‌కు అవసరమైన చికిత్సలు చేయడానికి వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధుల డాక్టర్ లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తుందని, ఆర్థిక భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బందెల కృష్ణ, సాయికిరణ్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేల అభివృద్ధికి రూ. 80వేల కోట్లు

- పదేళ్లలో తెలంగాణకు రూ. 42వేల కోట్లు ఇచ్చాం
- కేసీఆర్ వైఖరితో పదేళ్లపాటు ఫీజు రీయింబర్స్ మెంట్ రాక విద్యార్థుల తిప్పలు
- రాష్ట్ర బడ్జెట్ నుంచి కాంగ్రెస్ రూ. 8వేల కోట్లు చెల్లించలేదా..?
- ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం అందడంలేదు
- మోదీ నాయకత్వంలో 2026 నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తాం
- మంచిర్యాలలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



మంచిర్యాలలో వందే భారత్ రైలును ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

మంచిర్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 42 వేల కోట్లు ఖర్చు చేశామని, రాబోయే పదేళ్లలో రూ. 80వేల కోట్లతో పనులు చేపట్టబోతున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నాగ్‌పూర్-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇచ్చిన సందర్భంగా సోమవారం రైల్వే స్టేషన్‌కు వచ్చిన రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించా రు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మా ట్లాడుతూ మోదీ పాలనలో రైల్వే వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలో మరో రెండు రైళ్లు రాబోతున్నాయన్నారు. మంచిర్యాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రూ. 3.5 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేస్తానని తెలిపారు.

● రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇయ్యని కారణంగా లక్షలాదిమంది విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కేసీఆర్‌కు, కాంగ్రెస్‌కు తేడా ఏముందని, ఆనాడు చెక్కులిచ్చి బౌన్స్ చేసి ప్రజలను పిచ్చోళ్లను చేస్తే, ప్రస్తుతం కాంగ్రెస్ టోకెన్లు ఇస్తూ మోసం చేస్తోందే తప్ప పైసలియ్యడం లేదన్నారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్‌సిటీ, మిస్ వరల్డ్ పోటీలకు వేలకోట్లు ఖర్చు పెడతారు....పేద విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ కోసం రూ.8వేలకోట్లు బడ్జెట్‌లో పెట్టలేరా...? అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడంపైనా కేంద్రమంత్రి తీవ్రస్థాయిలో స్పందించారు. దేశాన్నిరక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలని, అలా కాకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తామన్నారు. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నామన్నారు. నరేంద్రమోదీ..

-మిగతా 7లో

కేరళ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇప్పించాలి.. - మంత్రి వివేక్



శబరిమల భక్తుల కోసం మంచిర్యాలలో కేరళ ఎక్స్ ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇప్పించాలని రాష్ట్ర గనులశాఖ మంత్రి గడ్డం వివేకానంద కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు విజ్ఞప్తి చేశారు. వివేకానంద మాట్లాడుతూ రా మగుండం, క్యాతనపల్లిలో రెండు ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించినట్లు తెలిపారు. తాను ఎంపీగా ఉన్న పుడు సికింద్రాబాద్-బెల్లంపల్లి మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్ ప్రెస్‌ను ప్రారంభించానన్నారు. రామగుండం ఫర్టిలైజ ర్స్‌ను రూ. 10వేల కోట్లతో తామే రీఓపెన్ చేయించి నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌లతో కలిసి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు కార్యక్రమానికి వచ్చిన కేంద్ర మంత్రి, మంత్రి, ఎంపీ లకు కలెక్టర్ కుమార్ దీపక్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఫలించిన ప్రయత్నం... - ఎంపీ వంశీకృష్ణ



మంచిర్యాలలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇప్పించేందుకు తాను చేసిన ప్రయత్నం ఫలించిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఎట్టకేలకు తన ప్రయత్నం ఫలించిందని, వందే భారత్ హాల్టింగ్ కల్పించినం దుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్య వాదాలు తెలిపారు. కొత్త రైళ్ల మంజూరు కోసం తన తాత వెంకటస్వామి, తండ్రి వివేక్ చేసిన కృషిని తాను కొనసాగిస్తున్నానన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థుల రాస్తారోకో



మంచిర్యాల జిల్లా జన్నారంలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో సోమవారం విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకోలు చేపట్టారు. వివిధ కళాశాలల ఎదుట విద్యార్థులు నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన తెలియ జేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అలాగే స్థానిక సీవీ రామన్ కళాశాలలో విద్యార్థులు తరగతులు బహిష్కరించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం నుంచి తాము కూడా కళాశాలు బంద్ చేసి, నిరసన లబాట పడుతామని డిగ్రీ, పీజీ ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.

మంచిర్యాల కలెక్టరేట్ : విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలోని డిగ్రీ, పీజీ కళాశాలల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ. 8200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పెండింగ్‌లో ఉందని, వీటిని చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు సికిందర్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం: పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో రోడ్డెక్కారు. సోమవారం ప్రధాన రహదారిపై అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఏబీవీపీ కరీంనగర్ విభాగ్, ఖేల్ కన్వీనర్ పందిరి మనీష్, నాయకులు రిస్వాంత్, అందేశ్, దేవాన్స్ మహేశ్, అమన్, అభిలాష్, అనుష్క, అక్షయ, లక్ష్మీ, క్రిష్ణ, సంజయ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ నిధులను అందంచడంతో పాటు ప్రతీ ఏటా విద్యార్థులకు రెగ్యులర్‌గా అందించే విదంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు.

ఇప్పటికే విద్యార్థులకు అందించే కోట్ల రూపాయలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మంత్రి వివేక్‌వెంకటస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియో జకవర్గ అభివృద్ధి పనులపై ప్రత్యేకదృష్టి సారించాలని రాష్ట్ర కార్మిక, కర్మాగార, గనులు, భూగర్భశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్‌కుమార్ దీపక్‌లతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సాగులో భాగంగా రైతులకు యూరియా పంపిణీలో జాగ్రత్తలు పాటించాల న్నారు. ప్రజా ఆరోగ్యమున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన అభివృద్ధి పను లను త్వరగా పూర్తి చేసి నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. భీమారం మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. అలాగే ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాల పోస్టర్లను విడుదల చేశారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఎంహెచ్‌వో అనిత, అధికారులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల చట్టం పకడ్బందీగా అమలు చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ తెన్మోజీ, ఇతర అధికారులు

నస్పూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వన్య ప్రాణులను వేటాడిన వ్యక్తులను పట్టుకుని వారికి శిక్షపడే విధంగా పకడ్బందీ చట్టం అమలు చేయాలని వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో (చెన్నై) రీజినల్ డిప్యూటి డైరెక్టర్ తెన్మోజీ అన్నారు.. నస్పూర్ పట్టణం సీసీసీ సింగరేణి అతిథి గృహంలో ఉమ్మడి జిల్లా అటవీ శాఖ అధికారులకు వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, సదరన్ రీజియన్ చెన్నై, తెలంగాణ అటవీ విభాగం సంయుక్తంగా రెండురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు ప్రారంభమైయ్యాయి. ఈ శిక్షణ తరగతులను తెన్మోజీ, కవ్వాల్ టైగర్ జోన్ అటవీ శాఖ అధికారి (ఎఫ్ డీపీటి) శాంతరాం జ్యోతి ప్రజ్వలన చేశారు. తెన్మోజీ మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడిన వేటగాళ్లను గుర్తించి శిక్షపడే విధంగా అన్ని ఆధారాలను సేకరించాలన్నారు. శిక్షణ తరగతుల్లో వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ మాధివ నన్, మంచిర్యాల, ఖానాపూర్ ఎఫ్‌డీవోలు శర్వేశ్వర్, శివ్ కుమార్, హైకోర్టు అడ్వకేట్ పరోపకారి, మంచిర్యాల ఎఫ్ఆర్ఓ రత్నకర్ రావు, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో అబ్దుల్ అజార్‌లతో పాటు ఉమ్మడి జిల్లాలోని అటవీ, పోలీస్ అదికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలను సరిపోల్చండి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2002, 2025 సంవత్సరాల ఓటరు జాబితాలను సరిపోల్చాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలను సరిపోల్చడంలో రెవెన్యూ గ్రామాన్ని ఒకయూనిట్‌గా తీసుకుని పరిశీలించాలన్నారు. నూతనంగా నియమించబడిన బూత్‌స్థాయి అధికారులకు తగు శిక్షణ అందించాలన్నారు. కలెక్టర్, ఎన్నికల అధికారి కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సం ఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల మ్యాపింగ్ ప్రక్రియ నిర్వ హిస్తామన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చంద్రకళ, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

● రైతులకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

లక్సెట్టిపేట, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా అందించడంలో విఫలమైందంటూ రైతులు మండిపడ్డారు. లక్సెట్టిపేట పట్టణంలో సో మవారం దండేపల్లి, లక్సెట్టిపేట రెండు మండలాల రైతులు పెద్దసంఖ్యలో ఆందోళన చేపట్టారు. రైతులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. సుమారు గంట పాటు రైతులు బీఆర్ఎస్ నాయకులు స్థానిక ఉత్కూర్ చౌరస్తాలోని రాష్ట్ర రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై మండిపడ్డారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు రోడ్డెక్కిన పరిస్థితులు లేవన్నారు. రైతు లకు యూరియా కూడా ఇవ్వలేకపోతున్న ప్రభుత్వం మన రేవంత్ ప్రభుత్వం అంటూ విమర్శించారు. మరోవైపు మంచి ర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని నోరు విప్పితే అన్ని అబద్ధాలే అన్ని అం టూ ఎద్దేవా చేసారు. సుమారు గంట పాటు రోడ్డుపై బైఠా యించడంతో స్థానిక సీఐ రమణమూర్తి, ఎస్సై సురేష్ సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో చెదరగొ ట్టారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రైతులు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌కు యూరియా అందిం చాలని వినతిపత్రం అందజేసారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, డీసీ ఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దండేపల్లి పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లిలో రైతుల బైఠాయింపు

కోటపల్లి : కోటపల్లి మండల కేంద్రంలో సోమవారం రైతులు రోడ్డెక్కారు. తమకు ఇంత వరకు యూరియా రాలే దని, యూరియా అందించాలంటూ రోడ్డుపై బైఠాయించారు. కోటపల్లి-చెన్నూరు ప్రధాన రహదారిపై రైతు వేదిక ముందు రైతులు బైఠాయించి రెండు గంటల పాటు ధర్నాకు దిగారు. దీంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయాయి. రైతు వేదిక వద్ద ఎరువుల పంపిణీ ఉంటుందని తప్పుడు ప్రచారం జరగడంతో వివిధ గ్రామాల నుంచి వందలాది మంది రైతులు రైతు వేదిక వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. అయితే ఆందోళనకారులను శాంతించేందుకు వ్యవసాయశాఖ ఏఈవో రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బంది ప్రయత్నించినా రైతులు వినకుండా రోడ్డుపైనే బైఠాయించారు. ఎస్‌ఐ రాజేందర్, ఏఈవో రాజ్‌కుమార్‌లు రైతులను సముదాయించి రోడ్డుపై నుంచి లేపి రైతువేదిక వద్దకు తీసుకువెళ్లి మాట్లాడారు. మంజూరై వచ్చే యూరియాబస్తాల పంపిణీలో మొదటి ప్రాధాన్యత మీకే ఇస్తామంటూ టోకెన్‌లు అందించారు. దీంతో రైతులు శాంతించారు.

చెన్నూరు: రైతులకు సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం కిష్టంపేట గ్రామంలోని రైతువేదిక వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. మండలంలోని నారాయణపూర్, కత్తెరసాల గ్రామాలకు రైతులకు పంపిణీ చేసేందుకు కిష్టంపేట గ్రామంలోని రైతువేదిక వద్దకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 444యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో రైతులు దాదాపు 800మంది రైతువేదిక చేరుకున్నారు. పంపిణీ ప్రారంభించకపోవడంతో రైతులు ధర్నాకు దిగారు. చెన్నూరు-మంచిర్యాల రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న చెన్నూరు సీఐ దేవేంద ర్‌రావు, ఎస్ఐ సుబ్బారావులు చేసుకుని రైతులకు నచ్చజె ప్పారు. దీంతో పోలీసు పహారామధ్య యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

● చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం చౌరస్తావద్ద సోమవారం మహిళ రైతులు యూరియా పంపిణీ చేయాలని ధర్నా నిర్వహించారు. రోడ్డుపై ధర్నా చేయడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయాయి. దీంతో కొద్ది సేపటి తర్వాత రైతులు వెళ్లిపోయారు.



రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేస్తున్న నాయకులు, రైతులు



కోటపల్లిలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అతివల ఆరోగ్యానికి రక్ష.. -రేపటి నుంచి మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాలు 7లో